గుంతల దారి.. పడతారు జారి!

- అధ్వానంగా కొత్తచెరువు-పెనుకొండ రహదారి
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు

పుట్టపర్తి అర్బన్: రోడ్లపై భారీ గుంతలు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కొత్తచెరువు- పెనుకొండ రహదారి, పుట్టపర్తి-నల్లమాడ ప్రధాన రహదారిపై గుంతలతో ప్రయాణం కష్టాలను ఏరికోరి తెచ్చుకున్నట్లు అవుతోంది. గుంతలు లేని రోడ్లే తమ లక్ష్యమని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. ఇందుకోసం రూ.కోట్లు నిధులు విడుదల చేసినట్లు ప్రచారం చేసుకుంటోంది. అయితే పుట్టపర్తి నియోజకవర్గంలోని చాలా రహదారులపై గుంతలతో వాహనదారులు కష్టతరమైన ప్రయాణాన్ని సాగిస్తున్నారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు..

పెనుకొండ-కొత్తచెరువు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. భారీ గోతులతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. కొత్తచెరువు దాటగానే లోచర్ల చెరువు వద్ద భారీ గుంతలతో ప్రయాణానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక లోచర్లలోకి వెళ్లే ముఖ్యమైన రోడ్డుపై భారీ గుంత పడి వాహన దారులు హడలిపోతున్నారు. లోచర్లలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెండు మూడు అడుగుల మేర లోతుతో గుంతలు పడ్డాయి. అక్కడి నుంచి బైరాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో భారీ గుంతలు పడ్డాయి. ఇటీవల గుంతలను తప్పించ బోయిన కారు బైరాపురం గ్రామానికి చెందిన పోస్ట్‌మ్యాన్ రామచంద్రారెడ్డిని ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాడు. ఇక పెనుకొండ- కొత్తచెరువు రహదారిపై తరచూ ప్రయాణించే ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి రోడ్డు మరమ్మతు గురించి పట్టించుకోవడం లేదని మండలవాసులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పుట్టపర్తి-నల్లమాడ ప్రధాన రహదారిపై వెంగళమ్మచెరువు వద్ద ఓ గుంత ప్రమాదకరంగా మారింది. అలాగే పెద్ద కమ్మవారిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయమైంది.


పెనుకొండ-కొత్తచెరువు రోడ్డు దుస్థితి


లోచర్ల వద్ద ప్రమాదకరంగా మారిన గుంత

రోడ్డుపై ప్రమాదకర గుంత

కొత్తచెరువు నుంచి లోచర్ల వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా లోచర్ల వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత చాలా ప్రమాదకరంగా మారింది. వాహనం ఆదమరచి నడిపితే ఇంతే సంగతులు. పొలాలకు చెరువు నీళ్లు వెళ్లేందుకు తీసిన కాలువపై రోడ్డు దిగబడింది. దీంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.
– రాజారెడ్డి, లోచర్ల, కొత్తచెరువు మండలం

రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాం

రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చడానికి ఇటీవల ప్రభుత్వానికి రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే గుంతలను పూడ్చి ఇబ్బందులను తొలగిస్తాం.
– వన్నూరుస్వామి, ఆర్అండ్‌బీ ఏఈఈ


క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం,పీడీ

పుట్టపర్తి: బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జగదీశ్, పీడీ నాగరాజు బుధవారం తెలిపారు. అనంతపురంలో జరిగిన అండర్-19 విభాగం జిల్లా స్థాయి హాకీ పోటీల్లో పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రశాంత్, లోకేశ్ ప్రతిభ కనబరిచాన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు కాకినాడలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఇదిలా ఉండగా ఏలూరులో జరిగిన అండర్-19 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బాబావలి ఉత్తమ ప్రతిభ కనపరిచి నాలుగో స్థానం నిలిచినట్లు పీడీ తెలిపారు. క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులను హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రారంభోత్సవం


అలంకరణలో వాల్మీకి మహర్షి విగ్రహం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రం చెన్నేకొత్తపల్లిలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయమే గణపతి పూజతో ప్రారంభమై వాల్మీకి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రాణప్రతిష్ట గణపతి హోమం, రుద్ర, నవగ్రహ హోమాలు చేశారు. అలాగే వాల్మీకి మూల మంత్ర హోమం, శ్రీరామ మూల మంత్ర హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాల్మీకి సామాజికవర్గం మహిళలు బోనాలతో ఊరేగింపుగా విగ్రహం వద్దకు చేరుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

తాడిమర్రి: మండలంలోని రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ మదన్‌మోహన్ పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు క్రమ సంఖ్యలో అందరికి వీలైనంత త్వరగా అందిస్తామన్నారు. గ్రామాల్లో శిథిలావస్థకు చేసిన ఐరన్, సిమెంట్ స్తంభాలను వెంటనే మారుస్తామన్నారు. ఎక్కడైనా సమస్యలు వస్తే తనకు తెలియజేస్తే వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

బోధనకు ఆటంకం కలిగించే పనులు వద్దు

తనకల్లు: ఉపాధ్యాయులకు బోధనకు ఆటంకం కలిగించే పనులు అప్పగిచొద్దని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత , ప్రాథమికోన్నత పాఠశాలల్లో బుధవారం యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ పనులతో ఉపాధ్యాయులకు బోధనకు ఆటంకం కలుగుతోందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపునివ్వాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీప్రసాద్, మండల నాయకులు శ్రీనివాసులు, ఎస్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోండి

కదిరి అర్బన్: మండంలోని ప్రజలంతా సంక్షేమ పథకాల వర్తింపు కోసం ఈ నెల 15లోపు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని ఎంపీడీఓ పోలప్ప బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దగ్గరలోని బ్యాంక్, పోస్టాఫీస్‌లో ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవచ్చని తెలిపారు.

బాబా జయంత్యుత్సవాలకు హాజరుకండి


సీఎంను ఆహ్వానిస్తున్న రత్నాకర్, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్: నవంబర్ 23న జరిగే పుట్టపర్తిలో జరిగే సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలకు హాజరుకావాలని సీఎం చంద్రబాబును సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్ స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆహ్వానించారు. బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌తో కలిసి వారు సీఎంను కలిశారు. సీఎం స్పందించి ఈనెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని, వచ్చే ఏడాది శతాబ్ది జయంత్యుత్సవాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిద్దామని వారికి హామీ ఇచ్చారు.

మారుకా మచ్చల పురుగును నివారించుకోండి

తాడిమర్రి: కంది పంటను మారుకా మచ్చల పురుగు ఆశించిందని, దానిని నివారించు కుంటేనే అధిక దిగుబడి సాధ్యమని ఏడీఏ కృష్ణయ్య రైతులకు సూచించారు. నిడిగల్లు గ్రామంలో ఏఓ రమాదేవి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం ప్రభావం వలన కందిపంటలో మారుకా మచ్చల పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. పురుగు నివారణ కోసం స్పైనోపాడ్ 60 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. రబీకి సంబంధించి వేరుశనగ, వరి, టమాట పంటలకు ప్రీమియం చెల్లించే విధానంపై వివరించారు. ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది ఘన జీవామృతం, నీమాస్త్రం , బీజామృతం తయారి విధానాన్ని వివరించారు. వీఏఏ ఓబుళమ్మ, ఏహెచ్ఏ శివప్రకాష్, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తి టౌన్: పెడపల్లి గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రొహిబిషన్ ,ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఓ వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి 20 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఎస్ఐలు ఉమామనోహర్ రాజు, సునంద, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి



దంపెట్ల గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ స్వర్ణలత

బత్తలపల్లి: గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేకంగా గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం దంపెట్ల గ్రామంలో సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు. వాటిని పూర్తిగా విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రేషన్‌కార్డు, పింఛన్, ఇతరత్రా ఏవైనా ఇవ్వవచ్చన్నారు. అనంతరం గ్రామంలో రస్తా సమస్యలపై రెండు అర్జీలు అందించినట్లు తెలిపారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏఓ ఓబిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ షణ్ముక్‌కుమార్, ఈఓఆర్డీ క్రిష్టప్పలతో పాటు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: తుమ్మలబైలు గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో భూ సమస్యలకు సంబంధించి నాలుగు వినతులు అందినట్లు తహసీల్దార్ బాబూరావు తెలిపారు. ఈ వినతులను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వీఆర్ఓ జయరాములు, గ్రామసర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జయసింహరాజు తెలిపారు. విద్యార్థులు, పాఠకులు వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

గాండ్లపెంట: స్థానిక గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి ఫరియాభాను బుధవారం తెలిపారు. ఈ వారం రోజుల పాటు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రకళ, రంగోలి తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు, పాఠకులు వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్రరెడ్డి

ధర్మవరం రూరల్: పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ త్వరితగతిన పూర్తీ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతు వివిధ కారణాల చేత ఇప్పటికే ప్రకటించిన పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ వెంటనే పూర్తీ చేసి పురపాలక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ, ఆర్జిత సెలవులు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. బోధనేతర భారం తగ్గించాలన్నారు. డీఎస్సీ-03 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పట్టణశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, జగదీష్, గౌరవాధ్యక్షులు జెన్నే నాగప్ప, ఉపాధ్యాయులు బషీర్ అహమ్మద్, వెంకటేష్ పాల్గొన్నారు.

పొలం కంచె ధ్వంసం

కనగానపల్లి: అడవి జంతువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు పొలానికి వేసిన కంచెను కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ధ్వంసం చేశారని దాదులూరు కొట్టాలకు చెందిన మహిళా రైతు లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం దాదులూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామసభ నిర్వహించారు. ఈ మేరకు లక్ష్మీదేవి తహసీల్దార్ ప్రసాద్‌కు ఆమె వినతిపత్రం అందజేసింది. తమకు సర్వే నంబరు 65-1లో ఐదు ఎకరాల పొలం ఉందని, అందులో పండ్ల తోటలతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నామని లక్ష్మీదేవి తెలిపింది. పక్కనే ఉన్న నాగేశ్వరరెడ్డి అనే రైతు తన పొలానికి దారి కావాలంటూ కంచెను దౌర్జన్యంగా తొలగించాడని పేర్కొంది. పొలానికి మరో దారి ఉన్నా రాజకీయ దురుద్దేశంతో తమ పొలం కంచెను ధ్వంసం చేశాడని, ఇదేమని అడిగితే దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించింది. విచారణ చేసి న్యాయం చేయాలని వేడుకుంది. ఆర్ఐ సరళ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ రాము

బత్తలపల్లి: గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, ఎంపీడీఓ నరసింహనాయుడు ప్రజాప్రతినిధులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల, గ్రామస్థాయిలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, మండల అధికారులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-26పై ఒక రోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏఓ శ్రీనివాసులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో పంచాయితీల అభివృద్ధిప్రణాళిక పై సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26కు సంబంధించి గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలోని గ్రామాల అభివృద్ధి సహకరించాలని ఎంపీడీఓ వెంకట రంగారవు ప్రజా ప్రతినిధులను కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని ప్రజా ప్రతినిధులకు గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక 2025-26పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రెండేళ్లలో మండలంలో గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులను గుర్తించాలన్నారు. ఈవోఆర్డీ విజయ్‌శేఖర్ నాయుడు, వైస్ ఎంపీపీ బీసాని లింగమ్మ, సర్పంచులు బండారు బాలమ్మ, వెంకటనారాయణరెడ్డి, పుల్లయ్య, ఆదెప్ప, ఎంపీటీసీలు పెద్దన్న, చంద్రబాబు, కో ఆప్షన్ సభ్యుడు బాబా ఫక్రొద్దీన్ పాల్గొన్నారు.

ఓడీచెరువు: అధికారులు సమన్వయంతో పని చేస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ పేర్కొన్నారు. బుదవారం మండల పరిషత్ కార్యలయంలో 2024-25కు సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ, తహసీల్దార్ అనంతాచారి మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీరేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈఓఆర్డీ రమణానాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, డాక్టర్ భానుప్రకాశ్, ఎంఈఓ రమణ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడమే మన లక్ష్యమన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, పంచాయితీ కార్యదర్శి మంజులాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ ఈటెరాము అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 2025-26కు సంబంధించి గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈఓపీఆర్డీ మాధవరెడ్డి అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయితీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపరచాలన్నారు. సర్పంచులు ఆంజినమ్మ, నాగమునీశ్వరనాయుడు, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, కార్యదర్శి రెడ్డిభాస్కర్, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బాలిక మిస్సింగ్

కదిరి అర్బన్: మండలంలోని పట్నం గ్రామానికి చెందిన ఓ మైనర్‌బాలిక కనిపించకుండా పోయింది. ఈ నెల 9న కదిరిలోని కళాశాలకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. బాలిక తండ్రి, కుటుంబసభ్యులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం దక్కలేదు. దీంతో బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ మోహన్ తెలిపారు.

కన్నతల్లిని బస్టాండ్‌లో వదలిపెడతారా?

- కుటుంబ సభ్యులపై న్యాయమూర్తి ఆగ్రహం


వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పచెబుతున్న ఎస్ఐ

కదిరి టౌన్: కన్నతల్లిని బస్టాండ్‌లో వదిలిపెడతారా.. నలుగురు బిడ్డలున్న మీకు మానవత్వం లేదా అని కుటుంబ సభ్యులపై కదిరి న్యాయమూర్తి జయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఈనెల 9న భూక్య లక్ష్మీబాయి(75)ని కుమారుడు సోమందేపల్లి బస్టాండ్‌లో వదిలేసి వెళ్లాడు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గుర్తించిన ఆటో డ్రైవర్ హరి పోలీసులకు సమాచారం అందించాడు. సోమందేపల్లి ఎస్ఐ రమేష్ బాబు స్పందించి వృద్ధురాలిని అమడుగూరులోని శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమంలో చేర్పించారు. దీనిపై మీడియాలో రావడంతో కదిరి న్యాయమూర్తి జయలక్ష్మి స్పందించారు. కోర్టు సిబ్బంది సమాచారం మేరకు అమడగూరు ఎస్ఐ వెంకటనారాయణ వృద్ధురాలి కుటుంబ సభ్యులు, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతితో కలసి న్యాయమూర్తిని కలిశారు. ఇక నుంచి వృద్ధురాలిని ఒంటరిగా వదిలేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాని న్యాయమూర్తి కుటుంబ సభ్యులను హెచ్చరించారు. వృద్ధురాలిని బాగా చూసుకుంటామని హామీ పత్రం ఇవ్వడంతో లక్ష్మీబాయిని వారికి అప్పగించారు.

సంక్షిప్త సమాచారం

వీఆర్ఏ గుండెపోటుతో మృతి

రామగిరి: తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తున్న సాకే పెద్దన్న (55) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకొన్న జెడ్పీటీసీ సభ్యుడు గోసే నాగార్జున, సర్పంచ్‌లు మీనుగ నాగరాజు, ఓబిరెడ్డితోపాటు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

పాలక మండలిని నియమించాలి

నల్లమాడ: ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్‌కు వెంటనే పాలక మండలిని నియమించాలని వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి, మాజీ సచివాలయ కన్వీనర్ సాతర్ల రామచంద్ర ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు బీసీ కార్పొరేషన్‌లకు ఇటీవల ప్రభుత్వం చైర్మన్లను నియమించిందని, అధిక జనాభా కలిగిన వడ్డెర కార్పొరేషన్‌కు చైర్మెన్, పాలక మండలిని నియమించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఈసారి రాయలసీమ వారికి కేటాయించాలని, కార్పొరేషన్‌కు కనీసం రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎస్ఐ చొరవతో ప్రధాన రహదారి శుభ్రం

ఓడీచెరువు: ఎస్ఐ మల్లికార్జునరెడ్డి చొరవతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి శుభ్రమైంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మొత్తం మట్టి దిబ్బలతో, కంపుకొడుతున్న మురుగునీటి గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన ఎస్ఐ ఏఎస్ఐ కిశోర్‌రెడ్డి, సిబ్బందితో కలసి బుధవారం నేషనల్ హైవే యంత్రాలతో మట్టిదిబ్బలను దగ్గరుండి తీయించారు. గుంతలను పూడ్చించారు.

ఏపీ ఎస్టీఏ కోశాధికారిగా పుల్లయ్య

తనకల్లు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా టీ. పుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన బుధవారం తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాగా టీ. పుల్లయ్య ఎంపికపై మండల ఉపాధ్యాయులు సిద్దారెడ్డి, ఎస్‌వీఎస్ ప్రసాద్, నరసింహులు, హరహరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ బుధవారం ఉదయం బత్తలపల్లి మండలం గుమ్మల్లకుంట క్రాస్, వేల్పుమడుగు క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గుమ్మల్లకుంట క్రాస్ వద్ద అనంతపురానికి చెందిన రెండు టిప్పర్లు, వేల్పుమడుగు క్రాస్ వద్ద అనంతసాగరం గ్రామానికి చెందిన ఓ టిప్పరు అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకుని సీజ్ చేశారు. వాహనదారులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ముదిగుబ్బ: పట్టణ శివారులో బుధవారం అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ నారాయణస్వామి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ప్రజలు ఉచితంగా ఇసుకను తరలించుకునే వీలు ఉందని, ఇతర ప్రాంతాలకు ఎటువంటి అనుమతులు లేకుండా తరలించడం నేరమన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తనకల్లు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ గోపి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తలుపుల: గుండువారిపల్లి పీవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న షిర్డీసాయిబాబా ఆలయ నిర్మాణానికి బుధవారం మాజీ సర్పంచ్ ఎం. పురుషోత్తంరెడ్డి రూ. 20 వేలు విరాళం అందించారు. ఈసందర్భంగా ఆయనకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి

కనగానపల్లి: సీనియారిటీ ప్రాతిపాదికన ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు అశోక్‌కుమార్, ముత్యాలప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ సభ్యత నమోదు కోసం బుధవారం వారు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. మామిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు గోపాల్ నాయక్, మండల నాయకులు నాగేంద్ర, ఆంజనేయులు, కేసీ ఆనంద్, రఫీ, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి

బత్తలపల్లి: స్థానిక గ్రంథాలయంలో గురువారం నుంచి ఈనెల 20 వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి కోరారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లును ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయోద్యమకారుల స్మరణ, 17న కవి సమ్మేళనం, 18న పాఠశాల విద్యార్థులకు పోటీలు, 19న మహిళలకు పోటీలు, 20న విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన నిర్వహిస్తామని వివరించారు.

తాడిమర్రి: స్థానిక గ్రంథాలయంలో గురువారం నుంచి ఈనెల 20 వరకు జరగనున్న 57వ గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కృష్ణమోహన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ అధికారి డీ.శీనా నాయక్, ఎంఈఓ వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు సిసేంద్రతో కలసి వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అలాగే ఆయన కేజీబీవీలో ఉపాధ్యాయునులతో కలసి కరపత్రాలు విడుదల చేశారు. ఎస్ఓ వాణిశ్రీ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.